భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

14, నవంబర్ 2026, శనివారం భారత్ సమాచార్

శ్రీరామగిరిలో ఘనంగా బాలల దినోత్సవ గ్రామసభ



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: బాలల హక్కులను గౌరవిస్తూ, వారి కలలకు రెక్కలు తొడిగి ప్రతి బిడ్డకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు అందరం కలిసి కృషి చేయాలని శ్రీరామగిరి గ్రామ సర్పంచ్ మాధురి ప్రశాంత్ పిలుపునిచ్చారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ ప్రశాంత్ అధ్యక్షతన బాలల గ్రామసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల సంక్షేమం, వారి హక్కులు, భవిష్యత్తుకు సంబంధించిన పలు అంశాలపై గ్రామసభలో చర్చించారు.

బాలల గ్రామసభలో పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, రక్షణ వంటి ముఖ్యమైన అంశాలపై సమాలోచనలు చేశారు. పిల్లలకు అందాల్సిన సౌకర్యాలు, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అవసరాలను తెలుసుకునేందుకు ఈ సమావేశం వేదికగా నిలిచింది.



ఈ సందర్భంగా సర్పంచ్ ప్రశాంత్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భారత పౌరులని, పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని తెలిపారు. ప్రతి చిన్నారి తన కలలను సాకారం చేసుకునేలా నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలల సంక్షేమం కోసం గ్రామపంచాయతీ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు బాలల గ్రామసభ మంచి వేదికగా ఉపయోగపడుతుందని చెప్పారు. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం కల్పించడం ద్వారా వారి అవసరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామగిరి సుమన్,
పంచాయతీ సెక్రటరీ సీహెచ్ మౌనిక, అంగన్వాడీ టీచర్లు,
గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar